
సాక్షి
మెదక్
సోమవారం, 6, ఫిబ్రవరి, 2023



చికిత్స పొందుతున్న విద్యార్థిని మృతి
సిర్గాపూర్ గురుకుల పాఠశాల విద్యార్థిని రాథోడ్ లక్ష్మి(16) మృత్యువుతో పోరాడుతూ ఆదివారం తుదిశ్వాస విడిచింది. 8లో



మార్చిలో రైలు కూత 8లో
మనోహరాబాద్ – కొత్తపల్లి లైన్‌పై మార్చిలో రైలుకూత పెట్టే అవకాశం కనిపిస్తోంది. గజ్వేల్ మీదుగా సిద్దిపేట వరకు రైలును నడపడానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు.



బాధ్యతలు చేపట్టేది ఎప్పుడో?
రైతులకు సాగు పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఆత్మకమిటీలను నియమించింది. ఆదేశాలు ఇచ్చి ఆరు నెలలైనా ప్రమాణస్వీకారం పూర్తికాలేదు. 9లో

న్యూస్‌రీల్

ఏడుపాయల జాతరకు రండి



ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న పాలకవర్గం

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల జాతరకు హాజరుకావాలని కోరుతూ ఆదివారం ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈఓ సార శ్రీనివాస్ మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి ఆహ్వానపత్రికను అందజేశారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని ఈనెల 18 నుంచి ఏడుపాయల జాతర ప్రారంభ కానుంది. కార్యక్రమంలో ధర్మకర్తలు సిద్దిరాములు, మనోహర్, సాయిలు, మణెమ్మ కిషన్, పెంటయ్య, నాగభూషణం, బీఆర్‌ఎస్ మండల నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దశంకరంపేట(మెదక్): గ్రామీణ ప్రాంత ప్రజలు పోస్టాఫీస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డి డివిజన్ పోస్టల్ ఎస్పీ ఎస్‌వీఎల్ఎస్ రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఎం కిసాన్ లబ్ధిదారులకు ఐపీపీబీ అకౌంట్లు ఓపెన్ చేయడానికి ఈనెల 15 వరకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. తపాల శాఖ ద్వారా బీపీఎంలు, పోస్ట్‌మెన్లు, ఖాతా ఉన్నవారి ఇంటి వద్దకు వెళ్లి అకౌంట్లు ఓపెన్ చేస్తారని ఆయన వివరించారు. సంగారెడ్డి డివిజన్ పోస్టల్ పరిధిలో 14,500 మంది కిసాన్ సమ్మాన్ రైతులు ఉన్నారని వెల్లడించారు. వారందరికీ ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ పోస్టల్ ఖాతా ద్వారా డబ్బులు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెయిల్ ఓవర్సీస్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఠాక్రేను కలిసిన ఆంజనేయులు గౌడ్



కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రేతో ఆంజనేయులుగౌడ్

నర్సాపూర్: నియోజకవర్గంలో కాంగ్రెస్ చేపట్టనున్న కార్యక్రమ వివరాలను పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మాణిక్‌రావుకు వివరించినట్టు తెలంగాణ పీసీసీ డెలిగేట్ ఆంజనేయులుగౌడ్ చెప్పారు. ఆదివారం పలువురు నియోజకవర్గ నాయకులతో కలిసి గాంధీభవన్‌లో మాణిక్‌రావు ఠాక్రేను సన్మానించారు. అనంతరం నియోజకవర్గంలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర చేపట్టేందుకు రూపొందించిన ప్రణాళికను, పార్టీ స్థితిగతులను ఆయనకు వివరించామని తెలిపారు.

'కేంద్ర బడ్జెట్‌లో పేదలపై వివక్ష'

నిజాంపేట(మెదక్): పేదలకు ఆహార భద్రత, ఆదాయం కల్పిస్తున్న ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు తగ్గించినందుకు నిరసనగా ఆదివారం నిజాంపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద డీబీఎఫ్ అధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈసందర్భంగా డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుబాసి సంజీవ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించి పని హక్కుల పరిరక్షణకు ఉద్యమిస్తామని పేర్కొన్నారు. ఒడిశా, కేరళ ప్రభుత్వాల మాదిరిగా అదనంగా 50 రోజుల పని దినాలను కల్పించే విధంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

నిండు కుండలా కూడవెల్లి



మల్లన్న జలాలతో నిండుకున్న కూడవెల్లి

మిరుదొడ్డి(దుబ్బాక): మల్లన్న సాగర్ నుంచి వదిలిన జలాలతో కూడవెల్లి వాగు నిండు కుండను తలపిస్తోంది. మండలంలోని అందె, అల్వాల, లింగుపల్లి, మిరుదొడ్డి, కాసులాబాద్, మోతె, అక్బర్‌పేట– భూంపల్లి మండలాల పరిధిలోని చెక్ డ్యాంలు నీటితో నిండుకున్నాయి. చెక్ డ్యాంలు పొంగి పొర్లుతుండటంతో వాగులు జలకళను సంతరించుకున్నాయి.

'పద్దు' పొడిచేనా!



- నిధుల లేమితో జిల్లాలో నిలిచిన అభివృద్ధి
- నేటి బడ్జెట్‌పైనే ఆశలు

మెదక్‌జోన్: రాష్ట్ర బడ్జెట్‌ను ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి హరీశ్‌రావు సోమవారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టనున్నారు. ఏళ్ల తరబడి జిల్లా అన్ని రంగాల్లో వెనుకబడి ఉంది. గతంలో పేరుకు మాత్రమే జిల్లా పాలన.. కానీ అంతా సంగారెడ్డి కేంద్రంగా సాగింది. ఇప్పటికైనా వెనకబడిన జిల్లా అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్‌లో ప్రత్యేక స్థానం కల్పించి నిధులు విడుదల చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఘనపూర్‌కు రూ. 25 కోట్ల మేర అవసరం



- జిల్లాలో సుమారు 4 లక్షల ఎకరాల సాగు భూములు ఉండగా ఇక్కడ మధ్య తరగతి ప్రాజెక్టు ఘనపూర్ తప్ప చెప్పుకోదగ్గ నీటి వనరులు లేవు.
- ఈ ప్రాజెక్టు ఆనకట్ట వెనకాల ప్రస్తుతం 21 వేల ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. ప్రాజెక్టు ఎత్తుపెంపునకు గతంలో ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.
- దీనిని 1.72 మీటర్ల ఎత్తుపెంచితే అదనంగా మరో ఆరు వేల ఎకరాలు సాగులోకి వస్తుందని.. ఇందుకు రూ. 25 కోట్లు అవసరమని, అందజేస్తామని హామీ ఇచ్చారు.
- వాటితో కాలువల ఆధునీకరణతో పాటు ప్రాజెక్టు ఎత్తుపెంపు, పూడికతీత పనులు, ముంపునకు గురయ్యే బాధిత రైతులకు పరిహారం చెల్లించేందుకు ప్రతిపాదనలు పంపారు.
- ఈ బడ్జెట్‌లో నిధులు మంజూరైతే మెదక్, ఘనపూర్, కొల్చారం, పాపన్నపేట మండలాల పరిధిలో అదనంగా మరో ఆరు వేల ఎకరాలు సాగులోకి రానుంది.

కాళేశ్వరం కాలువలకు..

- జిల్లాలో చేగుంట, నార్సింగ్, చిన్నశంకరంపేట మండలాల్లో కాళేశ్వరం కాలువ సుమారు 32.25 కిలోమీటర్లు తవ్వాల్సి ఉంది.
- ఇందుకు రూ. 154 కోట్లు విడుదల కావాల్సి ఉండగా ఇప్పటివరకు రూ. 50 కోట్లు మాత్రమే విడుదల అయ్యాయి.



- ఇంకా రూ. 104 కోట్లు విడుదల కావాల్సి ఉంది. ఇప్పటికీ 27 కిలో మీటర్ల మేర ప్రధాన కాలువను తవ్వారు.
- 18 డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్‌ను సైతం తవ్వాల్సి ఉంది. కాలువ పూర్తయితే 19,450 ఎకరాలకు సాగు నీరు అందునుంది.

నత్తనడకన 'మనబడి' పనులు

- మన ఊరు– మనబడి ద్వారా ప్రభుత్వ బడులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతామని జిల్లాలో మొదటి విడతగా 313 పాఠశాలలను ఎంపిక చేశారు.



- ఇందుకోసం రూ. 125 కోట్లు విడుదల కావాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం రూ. 5 కోట్లు మాత్రమే విడుదల అయ్యాయి.
- దీంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. బిల్లుల విడుదలలో జాప్యంతో కాంట్రాక్టర్లు పనుల్లో వేగం పెంచడంలేదు.

నిధులు లేక.. పనులు జరగక



- జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలకు సమీకృత మార్కెట్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది.
- మెదక్‌లో మార్కెట్ కోసం బాలుర ఉన్నత కళాశాల ప్రాంగణంలో నిర్మించేందుకు స్థలం కేటాయించారు.
- అక్కడ నిర్మిస్తే వెజ్–నాన్‌వెజ్ వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతుందని వ్యతిరేకిస్తూ కొందరు హైకోర్టును ఆశ్రయించారు.
- దీంతో అక్కడ నిర్మించొద్దని కోర్టు తీర్పు వెలువడిన నేపథ్యంలో ఇరిగేషన్ ఎస్ఈ కార్యాలయం ఎదుట కేటాయించారు.
- నర్సాపూర్‌లో రూ. 3 కోట్లతో మార్కెట్ నిర్మాణాన్ని చేపట్టగా నిధుల విడుదలలో జాప్యంతో సదరు కాంట్రాక్టర్ పనులు మధ్యలో నిలిపివేశారు.
- రామాయంపేట మున్సిపాలిటీల్లో పనులు నెమ్మదిగా కొనసాగుతుండగా, తూప్రాన్‌లో పనులు పూర్తయి అందుబాటులోకి వచ్చింది. మిగితా వాటికి నిధులను విడుదల చేయాల్సి ఉంది.

సొంతింటి కల తీరేనా..

- పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్రూంల నిర్మాణం ఆశించిన మేర నెరవేరలేదు.
- జిల్లావ్యాప్తంగా 4,700 ఇళ్లు నిర్మించాలనే లక్ష్యం కాగా ఇప్పటివరకు 2,419 మాత్రమే పూర్తి చేశారు.
- మరో వెయ్యి ఇళ్లకు టెండర్ వేసినా కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు. సొంత స్థలం ఉన్నవారి ఇంటి నిర్మాణానికి రూ. 3 లక్షలు ఇస్తామని ఇప్పటికే ప్రకటించారు. అందులో జిల్లాకు ప్రత్యేక నిధులు కేటాయించాలని పలువురు కోరుతున్నారు.
- అలాగే జిల్లావ్యాప్తంగా మహిళా సంఘాలు 13,038 ఉండగా.. వాటి పరిధిలో 1,30,380 మంది సభ్యులు ఉన్నారు.
- వీరు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలకు పావలా వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తున్నారు.
- కాగా ఈ వడ్డీ మొత్తం ఇప్పటివరకు రూ. 90.20 కోట్లు మహిళా సంఘాలకు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది.

పర్యాటకానికి ఏ మేరకు..

- జిల్లాలో చారిత్రాత్మక ప్రాంతాలు ఉన్నాయి. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన చర్చి, రాజుల కాలం నాటి ఖిల్లా, జింకల పెంపు (కేంద్రం) పోచారం అభయారణ్యం, దానిపక్కనే అందమైన గుట్టల మధ్య సహజ సిద్ధంగా ఉట్టిపడే పోచారం ప్రాజెక్టు, ప్రసిద్ధి చెందిన ఏడుపాయల ఆలయం, కొల్చారం మండల కేంద్రంలో గల జైన మందిరాలను పర్యాటక కేంద్రంగా చేయాల్సిన అవసరం ఉంది.
- అలాగే జిల్లావ్యాప్తంగా 21 మండలాలకు గాను 19 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 159 సబ్ సెంటర్లు ఉన్నాయి. కాగా వీటిలో 70 సబ్ సెంటర్లకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి.



- మరో 89 సెంటర్లు అద్దె భవనాలు, చిన్నపాటి ప్రభుత్వ గదుల్లో సాగుతున్నాయి. ఇందుకు నిధులు కేటాయించాల్సి ఉంది.
- జిల్లా కేంద్రంతో పాటు రామాయంపేట, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపాలిటీతో పాటు కొడిపల్లి మండల కేంద్రంలో మినీ ట్యాంకు బండ్ నిర్మాణాల ఏర్పాటుకు పనులు ప్రారంభించారు.
- వీటిలో కేవలం చెరువు కట్టలను మాత్రమే వెడల్పు చేసి వదిలేశారు. ఇవీ ప్రధానంగా నిధుల కొరత వల్లే అర్ధాంతరంగా నిలిచిపోయాయి.
- వీటిని పూర్తిచేస్తే ప్రజలకు ఉదయం, సాయంత్రం ఆహ్లాదకర వాతావరణం అందుతుంది.

సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



ప్రత్యేక ప్రార్థనలో భక్తులు, (ఇన్‌సెట్‌లో) దైవసందేశం ఇస్తున్న ప్రెసిబెటరీ ఇన్‌చార్జి శాంతయ్య

మెదక్‌జోన్: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమైన ప్రార్థనలు సాయంత్రం వరకు కొనసాగాయి. ఈసందర్భంగా భక్తులను ఉద్దేశించి ప్రెసిబెటరీ ఇన్‌చార్జి శాంతయ్య దైవ సందేశం ఇచ్చారు. కాగా దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

రానున్నది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే

- ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



చెక్‌డ్యాం వద్ద నినాదాలు చేస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: దేశ ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, రానున్నది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ(టీఎస్ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ మండలం బూర్గుపల్లిలో చెక్‌డ్యాంలోకి మల్లన్నసాగర్ సాగర్ నుంచి వచ్చిన గోదావరి జలాలకు ఆదివారం పూజలు నిర్వహించారు. నాందేడ్ సభ విజయవంతంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ బీజేపీ అవినీతి, అక్రమాలను అడ్డుకునే సత్తా సీఎం కేసీఆర్‌కు మాత్రమే ఉందని అన్నారు. ప్రజల మద్దతుతో రాబోయే రోజుల్లో బీజేపీని గద్దె దింపడం ఖాయమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సర్పంచ్ వంటేరు విజయ్‌వర్ధన్‌రెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు అబ్దుల్, నాయకులు రాజు, చంద్రాగౌడ్, స్వామి, భాస్కర్‌రెడ్డి, భరత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వాహిద్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం సర్పంచ్‌తో కలిసి సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. అంతకుముందు గజ్వేల్‌లోని సీఎం మినీ క్యాంపు కార్యాలయంలో క్షత్రియ రామజోగి అసోసియేషన్ కేలండర్‌ను మున్సిపల్ చైర్మన్ రాజమౌళితో కలిసి ఆవిష్కరించారు.

సీఎంకు ఆహ్వానం

నర్సాపూర్: బగలాముఖి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొనాలని సీఎం కేసీఆర్‌ను ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి ఆహ్వానించారు. ఆదివారం ప్రగతిభవన్‌లో సీఎంను కలిసి మాట్లాడారు. మెదక్ జిల్లాలోని బగలాముఖి అమ్మవారి ఆలయంలో ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఎమ్మెల్యే వెంట ఆలయ ట్రస్టు చైర్మన్ వెంకటేశ్వరశర్మ, శివ్వంపేట జెడ్పీటీసీ సభ్యుడు పబ్బ మహేశ్ గుప్తా, ట్రస్టు సభ్యుడు శివకుమార్‌గౌడ్, నాయకులు ఉన్నారు.



సీఎం కేసీఆర్‌కు ఆహ్వానపత్రికను అందజేస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, నాయకులు

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

సిద్దిపేటఎడ్యుకేషన్: విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ సిద్దిపేట ప్రాంతీయ సమన్వయ కర్త డాక్టర్ భవాని అన్నారు. ఆదివారం ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో నిర్వహించిన యూనివర్సిటీ 40 వసంతాల వేడుకల కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పేద విద్యార్థులకు వరమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్, పరీక్షల కంట్రోలర్ డాక్టర్ హుస్సేన్ మాట్లాడుతూ పట్టుదలతో చదివి అంబేడ్కర్ స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ కౌన్సిలర్ డాక్టర్ బాలయ్య, విష్ణుమూర్తి, అంజిరెడ్డి, విద్యార్థులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారులకు వృత్తినైపుణ్య శిక్షణ

గజ్వేల్: మండలంలోని మత్స్యకారులకు గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ ఊర చెరువులో ఆదివారం వృత్తి నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించినట్లు ఆ శాఖ ఏడీ మల్లేశం తెలిపారు. కార్యక్రమంలో 165మందికి శిక్షణ అందించినట్లు తెలిపారు. ఆయనతో అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌బాబు, జూనియర్ అసిస్టెంట్ రత్నమ్మ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో ఏడుపాయల కిటకిట



క్యూలైన్‌లో భక్తులు

పాపన్నపేట(మెదక్): వేలాది భక్తులతో ఆదివారం ఏడుపాయల కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు దుర్గమ్మను దర్శించుకోవడానికి బారులు తీరారు. అమ్మవారికి బోనాలు, ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఆలయ సిబ్బంది, పోలీసులు చర్యలు తీసుకున్నారు. మెదక్ జూనియర్ సివిల్ జడ్జి రీటాలాల్ చంద్ దంపతులు దుర్గమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సిబ్బంది వారికి స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి అమ్మవారి పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఊరేగించారు. వందలాది భక్తులు పల్లకీ సేవలో పాల్గొన్నారు.



అమ్మవారి సేవలో భక్తులు

మల్లన్న క్షేత్రం.. భక్త జనమయం

- భారీగా తరలి వచ్చిన భక్తులు
- కిక్కిరిసిన ఆలయ పరిసరాలు



బోనాలతో మహిళలు



గంగిరేణి చెట్టు వద్ద భక్తుల కోలాహలం

కొమురవెల్లి(సిద్దిపేట): కోరమీసాల మల్లన్న నీకు కోటొక్క దండాలు.. సత్తేటి వారాలా మల్లన్న నీకు లక్షొక్క దండాలు.. అంటూ భక్తులు మల్లికార్జున స్వామిని దర్శించుకొని తరించారు. మూడో ఆదివారం సందర్భంగా విచ్చేసిన భక్తులు, మల్లన్న నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. సంక్రాంతి తర్వాత వచ్చే సత్తేటి వారాల పూజలకు కరీంనగర్, మెదక్, నిజామాబాద్ జిల్లాల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసి పోయింది. స్వామి వారికి తలనీలాలు సమర్పించి, స్నానమాచరించి ఒక్క పొద్దులు, మట్టికుండలో పసుపు బియ్యంతో నైవేద్యం సమర్పించారు. గంగరేణి చెట్టువద్ద బోనం పెట్టి, పట్నాలు వేసి మొక్కులు అప్పగించారు. అనంతరం క్యూలో వెళ్లి మల్లన్నను దర్శించుకున్నారు. సుమారు 30వేల మంది స్వామివారిని దర్శించుకున్నట్లు సమాచారం. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయంలో గదులు సరిపోక ప్రైవేటును ఆశ్రయించారు. ధర్మదర్శనానికి 4గంటల సమయం, శీఘ్ర దర్శనానికి 3గంటలు, విశిష్ట దర్శనానికి 2గంటలు, వీవీఐపీ దర్శనానికి 1 గంట సమయం పట్టింది.

రేణుకా ఎల్లమ్మకు బోనాలు..

స్వామివారి దర్శన అనంతరం భక్తులు మల్లన్నగుట్ట(ఇంద్రకీలాద్రి గుట్ట)పై వెలసిన రేణుక ఎల్లమ్మకు బోనాలు సమర్పించారు. వేడుకల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా అడిషనల్ డీసీపీ మహేందర్ బందోబస్తు నిర్వహించారు.

ప్రముఖుల పూజలు

మల్లన్నకు ఆదివారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబసమేతంగా వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ చైర్మన్ గీస భిక్షపతి, ఈఓ బాలాజీ, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్ తదితరులు స్వాగతం పలికారు.



స్వామివారి నిత్యకల్యాణం జరిపిస్తున్న అర్చకులు

క్లుప్తంగా

తిరుమల ప్రయాణికులకు శీఘ్ర దర్శనం టికెట్లు

సంగారెడ్డిటౌన్: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉమ్మడి మెదక్ జిల్లా ఆర్టీసీ పరిధిలో ప్రయాణికులకు తిరుమల తిరుపతి దేవస్థానం శీఘ్ర దర్శనం టికెట్లు అందుబాటులో ఉన్నాయని మెదక్ రీజియన్ సుదర్శన్ ఆదివారం తెలిపారు. ఈనెల 21 నుంచి మార్చి 1వ తేదీ వరకు బాలాలయం కోసం బ్లాక్ చేయబడిన టికెట్లను మెదక్ రీజియన్ లోని సంగారెడ్డి, జహీరాబాద్ మెదక్ దుబ్బాక డిపోలలో టికెట్లు బుక్ చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలన్నారు.

ఐఐటీ పీఆర్వోకు రాష్ట్ర స్థాయి అవార్డు

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఐఐటీ హైదరాబాద్ (కంది) పీఆర్వో మిథాలీ అగర్వాల్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు దక్కింది. ఐఐటీ హైదరాబాద్, సాంస్కృతిక మంత్రిత్వశాఖతో దేశవ్యాప్తంగా కొనసాగుతున్న 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' కింద ఢిల్లీలోని సాంస్కృతిక మంత్రిత్వ శాఖ నిర్వహించిన లాలీ (లోరీ) పోటీలో ఐఐటీ హైదరాబాద్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ మిథాలీ అగర్వాల్ రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించారు. గతంలో మిథాలీ అగర్వాల్‌కు సంగారెడ్డి జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతికి ఎంపికైంది. రాష్ట్రస్థాయి అవార్డుతోపాటు ఢిల్లీలో రూ.75 వేల నగదు బహుమతి అందజేయనున్నారు.

ఉద్యమ కారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమ కళాకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల చంద్రమౌళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రంగధాంపల్లి అమరవీరుల స్తూపం వద్ద కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ బోర్డ్ ఏర్పాటు చేస్తూ శాసనసభలో ఆమోదించాలని సీఎం కేసీఆర్, ఆర్థిక మంత్రి హరీశ్ రావుకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఉత్తర తెలంగాణ ఫోరం కన్వీనర్ గుండేటి ఐలయ్య యాదవ్, రాష్ట్ర కమిటీ కార్యదర్శి శ్రావణ బోయిన నరసయ్య, రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు కరీంనగర్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల కన్వీనర్ ఆనంద్, చాంద్ పాషా, రాంబాబు, లాలయ్య, సుదర్శన్, కుమారస్వామి, బాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ..

రామాయంపేట(మెదక్): నార్సింగి మండలం జప్తిశివునూర్ వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. కామారెడ్డి నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారును లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో కారులో ఉన్న హైదరాబాద్ ఓల్డ్ బోయిన్‌పల్లికి చెందిన శ్రీకాంత్, నరేందర్, మధు, రమేశ్, డ్రైవర్ శ్రీనివాస్ గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నార్సింగి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

దుబ్బాకరూరల్: పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని పెద్దగుండవెల్లిలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆశంగారి మహేశ్‌గౌడ్(26) ఫిబ్రవరి 4వ తేదీన ఇంటి నుంచి వెళ్లాడు. ఆదివారం గ్రామ శివారులోని డబుల్‌బెడ్ రూం ఇళ్లలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.. మృతునికి భార్య,కూతురు ఉన్నారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు.

మార్చిలో రైలు కూత

- తాజాగా కేంద్ర బడ్జెట్‌లో రూ.185 కోట్లు కేటాయింపు
- మనోహరాబాద్–కొత్తపల్లి రైల్వేలైన్ పనులకు ఊపు
- సిద్దిపేట వరకు పనులు పూర్తి చేసి.. రైలును ప్రారంభించే యోచనలో దక్షిణ మధ్య రైల్వే


గజ్వేల్ లైన్‌పై ట్రయల్ రన్

గజ్వేల్: మనోహరాబాద్–కొత్తపల్లి లైన్‌పై మార్చిలో రైలుకూత పెట్టే అవకాశం కనిపిస్తున్నది. గజ్వేల్ మీదుగా సిద్దిపేట వరకు రైలును నడపడానికి దక్షిణ మధ్య రైల్వే అధికారులు కార్యాచరణ ముమ్మరం చేసినట్లు కనపడుతోంది. కేంద్రం ఈ లైన్‌కు రూ.185కోట్లు కేటాయించడం ఈ ఆశలకు బలం చేకూరుస్తున్నది. ఈ వ్యవహారంపై కథనం.

మెదక్ జిల్లా మనోహరాబాద్ నుంచి కొత్తపల్లి వరకు 151.36 కిలోమీటర్ల పొడవున ఈ న్యూబ్రాడ్‌గేజ్ లైన్ నిర్మాణం జరుగుతుండగా రూ.1160.47 కోట్లను వెచ్చిస్తున్నారు. ఉత్తర తెలంగాణ అభివృద్ధిలో ఈ రైల్వేలైన్ కీలక మలుపుగా మారనుంది. ఈ లైన్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి మనోహరాబాద్ మీదుగా కొత్తపల్లి వరకు, అక్కడి నుంచి పెద్దపల్లి గ్రాండ్ ట్రంక్ లైన్‌తో అనుసంధానం కానుంది. ఫలితంగా ఈ లైన్ హైదరాబాద్, న్యూఢిల్లీ, కలకత్తా లాంటి మహానగరాలను కలుపుతూ జాతీయ లైన్ గా ఆవిర్భవించనున్నది. పెద్దపల్లి గ్రాండ్‌ట్రంక్ లైన్‌కు ఇప్పటి వరకు సికింద్రాబాద్, ఖాజీపేట మార్గం అనుసంధానంగా ఉండేది. మనోహరాబాద్– కొత్తపల్లి రైల్వేలైన్ పూర్తయితే ప్రయాణీకులకు దూర భారం తగ్గనున్నది. మొత్తానికి ఈలైన్‌తో సిద్దిపేట జిల్లాతో పాటు మెదక్, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలకు భారీ ప్రయోజనం చేకూరనుంది.

43 కిలోమీటర్ల పనులు పూర్తి

- మెదక్ జిల్లా మనోహరాబాద్ నుంచి సిద్దిపేట జిల్లా గజ్వేల్ మీదుగా కొడకండ్ల వరకు 43 కిలోమీటర్ల రైల్వేలైన్ పనులు పూర్తయ్యాయి. అంతేకాకుండా గజ్వేల్ రైల్వే స్టేషన్‌ను హైదరాబాద్ నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్లకు గజ్వేల్ ప్రాంతమే ప్రత్యామ్నాయంగా మార్చి, దేశంలోని ముఖ్యమైన నగరాలకు కొన్ని కొత్త రైళ్లను ఇక్కడి నుంచి నడపాలని నిర్ణయించడం కూడా ఈ ప్రాంతానికి మరింత ప్రాధాన్యత పెరిగే అవకాశం కలిగింది.
- ప్యాసింజర్ రైలు నడపడానికి ఇప్పటికే రెండు మార్లు కమిషన్ ఆఫ్ రైల్వేసేఫ్టీ ఆధ్వర్యంలో 2020 జూన్ 20న, 2022 ఫిబ్రవరి 11వ తేదీన తనిఖీలు కూడా పూర్తయ్యాయి. మొదటి తనిఖీ మనోహరాబాద్ నుంచి గజ్వేల్ వరకు 33 కిలోమీటర్లు, రెండో తనిఖీ గజ్వేల్ నుంచి కొడకండ్ల వరకు మరో 10 కిలోమీటర్ల వరకు కొనసాగింది. మొత్తంగా మనోహరాబాద్ నుంచి కొడకండ్ల వరకు 43 కిలోమీటర్లు ప్యాసింజర్ రైలు నడపడానికి మార్గం సుగమమైంది.
- కాగా ప్యాసింజర్ సేవల్లో దక్షిణ మధ్యరైల్వే నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. గతేడాది జూన్ 27న ఇక్కడ ఆర్భాటంగా గూడ్స్ సేవలను రేక్ పాయింట్ కోసం ప్రారంభించింది. దీని ద్వారా రైల్వేశాఖకు మంచి ఆదాయం కూడా సమకూరుతోంది.
- రాబోవు రోజుల్లోనూ ఈ మార్గంగుండా దండిగా ఆదాయం రానున్నదని భావించిన రైల్వేశాఖ ఈ సేవలను వేగంగా విస్తరించడానికి సిద్ధమైంది.
- గజ్వేల్ రేక్ పాయింట్‌కు ఎరువులే కాకుండా ఇతర వ్యవసాయ, వ్యాపార ఉత్పత్తులు తరలిస్తే ఇక్కడి నుంచి సిరిసిల్ల, జనగామ, సంగారెడ్డి, మెదక్, కరీంనగర్, మేడ్చల్ జిల్లాలకు తరలించే అవకాశమున్నందువల్ల మాల్‌గాడీకి మంచి గిరాకీ ఉంటుందని కూడా భావిస్తున్నారు.
- దీని ద్వారా రైల్వే శాఖ ఆదాయనికి గజ్వేల్ రేక్ పాయింట్ ప్రధాన ఆదాయ వనరుగా భవిష్యత్‌లో అవతరించనున్నదని కూడా ఆశిస్తున్నారు.

ప్యాసింజర్ రైలు నడపడానికి ఏర్పాట్లు

గజ్వేల్ రైల్వేలైన్‌పై ప్యాసింజర్ రైలు సేవలను ప్రారంభించడానికి దక్షిణ మధ్య రైల్వేశాఖ ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వీలైనంత త్వరలో ఈలైన్ ప్రజలకు అందుబాటులోకి వచ్చే అవకాశముంది.
– జనార్దన్, దక్షిణ మధ్య రైల్వే ఇంజినీర్

ఇక్కడ గోదాముల నిర్మాణం ఇప్పటికే ఊపందుకుంది.

సిద్దిపేట లైన్ పూర్తికాగానే..

- ప్రస్తుతం మనోహరాబాద్ నుంచి గజ్వేల్ మండలం కొడకండ్ల వరకు 43 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ పనులు పూరయ్యాయి. కమిషన్ ఆఫ్ రైల్వే సేఫ్టీ తనిఖీలు కూడా పూర్తయితే రైలు నడపడమే మిగిలి ఉన్న సంగతి తెల్సిందే.
- ఇక్కడి నుంచి మరో 35 కిలోమీటర్ల సిద్దిపేట వరకు కూడా లైన్ పనులు పూర్తి కావస్తున్నాయి. సిద్దిపేటలో స్టేషన్ పనులు కూడా తుది దశలో ఉన్నాయి.
- కొత్తపల్లి వరకు 151.36కి లోమీటర్లు ఉన్న ఈ లైన్‌ను పూర్తి చేయడానికి రూ.1160.47 కోట్లు వెచ్చిస్తున్నారు.
- గత బడ్జెట్‌లో రూ.210 కోట్లు, ప్రస్తుత బడ్జెట్‌లో 185 కోట్లు, అంతకుముందు మరో రూ.50 కోట్లు కలుపుకొని ఇప్పటివరకు రూ.445 కోట్లకు పైగా నిధులు వచ్చాయి.
- తాజాగా నిధులతో పనులు మరింత వేగిరం చేసి మార్చి నెలాఖరులోగా రైలు నడపడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.

ఇంటి యజమాని మృతి

రోడ్డున పడిన కుటుంబం


రోదిస్తున్న మృతుడి బంధువులు

దుబ్బాక: నిరుపేద కుటుంబం, రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి. విధికి ఆ కుటుంబం పై కన్నుకుట్టినట్టుంది. సాఫీగా సాగిపోతున్న వారి జీవితంలో పెను విషాదం నెలకుంది. తండ్రి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో తీవ్ర ఆవేదనతో తనయుడు సైతం కానరాని లోకాలకు వెళ్లాడు. దీంతో ఆ కుటుంబం వీధి పాలైంది. వివరాలోకి వెళ్లితే దుబ్బాక పట్టణానికి చెందిన సుంకోజు సత్యనారాయణ (34) వృత్తిరీత్యా వడ్రంగి(దారుశిల్పి). తండ్రి భూషణం అనారోగ్యం కారణంతో గత ఆరు నెలల క్రితం మృతి చెందాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైనా సత్యనారాయణ నిద్రాహారాలు మాని డిప్రెషన్‌లోకి వెళ్లిపోయాడు. క్రమంగా సత్యనారాయణ ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. దీంతో వారం క్రితం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ఆస్పత్రికి తరలించాలని డాక్టర్లు సూచించారు. చేతిలో చిల్లి గవ్వ కూడా లేకపోవడంతో కుటుంబ సభ్యులు సిద్దిపేటలోనే చికిత్సచేయించారు. ఆదివారం ఉదయం గుండెపోటుతో సత్యనారాయణ మృతి చెందాడు. మృతుడికి భార్య సురేఖ, కూతరు, కొడుకు ఉన్నారు. కుటుంబ పెద్ద మృతితో ఆ కుటుంబం వీధి పాలైంది. ప్రభుత్వం, దాతలు ముందుకు వచ్చి కుటుంబానికి అండగా నిలువాలని స్థానికులు కోరతున్నారు.

చికిత్స పొందుతున్న విద్యార్థిని..


పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న నాయకులు

సిర్గాపూర్ ఎస్టీ బాలికల గురుకులంలో విషాదం

కల్హేర్(నారాయణఖేడ్): అయ్యో పాపం.. గురుకుల పాఠశాల విద్యార్థిని రాథోడ్ లక్ష్మి(16) మృత్యువుతో పోరాడినా ప్రాణం దక్కలేదు. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తుదిశ్వాస విడిచింది. ఈఘటనతో సిర్గాపూర్ గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో విషాదం నెలకొంది. కోహీర్ మండలం పిచ్చరేగడి తండాకు చెందిన రాథోడ్ లక్ష్మి సిర్గాపూర్ గురుకులంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఈనెల 3వ తేదీన పాఠశాల భవనం రెండో అంతస్తు పైనుంచి కిందపడి తీవ్ర గాయాలతో గాంధీ ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. ఎస్‌ఐ నారాయణ గాంధీ ఆస్పత్రికి వెళ్లి వివరాలు సేకరించారు. విద్యార్థిని తండ్రి రోథోడ్ నర్సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

సీఐ సందర్శన

కంగ్టి సీఐ రాజశేఖర్ సిర్గాపూర్ ఎస్టీ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థిని రాథోడ్ లక్ష్మి భవనం పై నుంచి పడిన స్థలాన్ని పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. బంజారా సంఘం రాష్ట్ర నాయకుడు చరణ్‌కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు గురుకుల పాఠశాలను సందర్శించారు. లక్ష్మి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. గురుకుల పాఠశాల భవనంపై గ్రిల్స్ ఏర్పాటు చేసి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీ వ్యక్తి..


కిషోర్ (ఫైల్)

పటాన్‌చెరుటౌన్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ప్రసాద్ రావు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సదాశివపేట్ మండలం ఆరూర్ గ్రామానికి చెందిన కిషోర్(27) ఇంటర్వ్యూ కోసం ఈనెల 3వ తేదీన హైదరాబాద్ వెళ్లాడు. 4వ తేదీన తిరిగి ఇంటికి బయలుదేరాడు. కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా లింగంపల్లిలో ఉన్నానని ఇంటికి వస్తున్నానని చెప్పాడు. శనివారం రాత్రి తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా పటాన్‌చెరులోని శ్రీకృష్ణ కార్ వాష్ సమీపంలో డివైడర్‌ని ఢీకొని అవతలి రోడ్డులో పడ్డాడు. అదే సమయంలో సంగారెడ్డి నుంచి పటాన్‌చెరు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కిషోర్‌ను పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికి మృతి చెందినట్లు వెల్లడించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య గాయత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి..

శివ్వంపేట(నర్సాపూర్): చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందాడు. ఈ సంఘటన మండల పరిధి శభాశ్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రంగు శ్రీనివాస్(27) ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి రాత్రి వరకు తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు సమీప ప్రాంతాల్లో వెతకగా గ్రామ శివారులో నర్సయ్య వ్యవసాయ బావి గట్టు వద్ద శ్రీనివాస్ చెప్పులు, దుస్తులు కనిపించాయి. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు సర్పంచ్ పార్వతి సత్యంకు సమాచారం ఇవ్వడంతో రాత్రి బావిలో గజ ఈతగాళ్లతో గాలించిగా మృతదేహం లభించింది. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్‌కుమార్



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్‌కుమార్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాలని, విద్యహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్ కుమార్ అన్నారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగాన్ని నిరుపేద విద్యార్థులకు అందించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, వైద్యరంగాలను నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. అభివృద్ధి అంటే కేవలం భవనాల నిర్మాణాలు కాదని, విద్య, వైద్యం ప్రజలకు ఉచితంగా అందినప్పుడే అభివృద్ధి చెందినట్లు అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు రోలర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

రోలర్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలు


రోడ్డు దిగువకు దూసుకెళ్లిన రోడ్డు రోలర్

జహీరాబాద్: రోడ్డు రోలర్‌ను ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో రోలర్ అదుపుతప్పి రోడ్డు దిగువకు దూసుకెళ్లి మట్టిలో కూరుకుపోయింది. రోలర్ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పెను ప్రమాదం తప్పడంతో బస్సులోని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఆదివారం మండలంలోని హుగ్గెల్లి గ్రామ శివారులో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని రూరల్ పోలీసులు తెలిపారు.


రోలర్‌ను ఢీకొట్టి నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

26న దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ


మంత్రిని కలిసిన సంగారెడ్డి జిల్లా కురుమ సంఘం నాయకులు

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఈ26వ తేదీన మంత్రి హరీశ్‌రావు దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు బూరగడ్డ నగేష్ తెలిపారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావును కురుమ సంఘం నాయకులతో కలిసినట్లు చెప్పారు. విగ్రహ ఆవిష్కరణకు రావాలని కోరగా ఆయన అంగీకరించారన్నారు. విగ్రహావిష్కరణ రోజు 10 వేల మందితో భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. మంత్రిని కలిసిన వారిలో రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప, డాక్టర్ శ్రీహరి కురుమ, కిష్టయ్య, కొల్కుర్ ప్రవీణ్, మాజీ డైరెక్టర్లు నగేశ్, భూమయ్య కురుమ, జిల్లా ఉపాధ్యక్షుడు కాల్వగడ్డ మల్లయ్య, సంగారెడ్డి కౌన్సిలర్ లాడే మల్లేశ్ తదితరులు ఉన్నారన్నారు.

భవనం కట్టుకుంటాం.. కాదు బస్టాండ్ కట్టాలి


రోడ్డుపై ధర్నా చేస్తున్న గ్రామస్తులు

- చాట్లపల్లిలో దళితులు వర్సెస్ గ్రామస్తులు
- రోడ్డుపై గ్రామస్తుల నిరసన
- స్థలం వద్ద దళితుల దీక్షలు
- ఇరు వర్గాలకు నచ్చజెప్పిన పోలీసులు


దళితులకు నచ్చచెబుతున్న ఎస్‌ఐ కృష్ణమూర్తి

జగదేవ్‌పూర్(గజ్వేల్): అది గ్రామ కంఠం భూమి. కానీ తమ కులానికి ఏళ్ల క్రితం భవన నిర్మాణం కోసం ఇచ్చారని ఓ వర్గం..కాదు అది మాదేనని మరో వర్గం వాగ్వాదానికి దిగారు. ఆ భూమిలో బస్టాండ్ నిర్మాణం చేపడుతామని గ్రామపాలక వర్గంతో పాటు గ్రామస్తులు తేల్చిచెప్పడంతో ఇరు వర్గాలు పోటాపోటీగా నిరసనకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చాట్లపల్లి గ్రామంలో అంతాయిగూడకు వెళ్లే రోడ్డు చౌరస్తాలో సుమారు 40 గజాల వరకు ప్రభుత్వ భూమి రోడ్డు పక్కన ఉంది. 20 ఏళ్ల క్రితం ఆ భూమి గ్రామ దళితుల భవనం కోసం ఇచ్చారని ప్రస్తుత దళిత నాయకులు చెబుతున్నారు. అప్పటి నుంచి ఆ భూమిలో ఎలాంటి నిర్మాణాలు జరగలేదు. ఇటీవల గ్రామ దళిత నాయకులు అంబేడ్కర్ భవనం కోసం భూమిపూజ చేస్తున్న క్రమంలో పక్కన ఇంటి వారు ఆ భూమి తమదేనని ఘర్షణకు దిగారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, గ్రామ పెద్దలు జోక్యం చేసుకుని ఇరు వర్గాల వారికి నచ్చజెప్పారు. అలాగే రెవెన్యూ అధికారులు, పోలీసులు కూడా చెప్పారు. అయినప్పటికీ దళితులు అదే భూమిలో భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. అక్కడే దళిత నాయకులు దీక్షలు చేపడుతున్నారు. ఆదివారం గ్రామస్తులంతా కలిసి చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించారు. గంటకు పైగా రోడ్డుపై బైఠాయించడతో కొండపోచమ్మ జాతరకు వెళ్లే భక్తులు ఇబ్బందిపడ్డారు. విషయం తెలుసుకున్న గజ్వేల్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ కృష్ణమూర్తి సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులను సముదాయించారు. అలాగే దళితులకు కూడా నచ్చజెప్పారు. సోమవారం అధికారులను కలిసి మాట్లాడుకోవాలని ఇరు వర్గాల వారికి సూచించారు. దీంతో ధర్నా విరమించారు. అనంతరం దళిత నాయకులు మాట్లాడుతూ రోడ్డుపై అన్ని కూలాల వారికి కుల భవనాల కోసం స్థలాలను భవనాలను అప్పగించారని, దళితుల భవనం వచ్చేసరికి అనుమతి లేదని కుంటిసాకులు చెబుతున్నారని వాపోయారు.

నిర్ణయాత్మక శక్తిగా వైఎస్‌ఆర్‌టీపీ


పార్టీలో చేరిన యువకులతో వైఎస్సార్‌టీపీ ఎస్సీ విభాగం జిల్లా యువత అధ్యక్షుడు ఉదయరాజు

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని సీతారాంకుంట తండా యువత ఆదివారం వైఎస్సార్ తెలంగాణ పార్టీలో చేరారు. వైఎస్సార్‌టీపీ ఎస్సీ విభాగం జిల్లా యువత అధ్యక్షుడు ఉదయరాజు పార్టీలో చేరినవారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. షర్మిలమ్మ చేపట్టిన పాదయాత్ర రాష్ట్రమంతా విజయవంతంగా కొనసాగుతుంటే అధికార పార్టీ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. దీంతో పాదయాత్రను ఆపేందుకు దాడులు చేస్తున్నారని ఆరోపించారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా తెలంగాణ రాష్ట్రమంతా పాదయాత్ర కొనసాగుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజల కష్టసుఖాలు తెలుసుకునేందుకు నేరుగా ప్రజల వద్దకే వెళ్తుంటే రాష్ట్రంలో వైఎస్సార్ టీపీ బలోపడుతుందో అని అధికార, ప్రతిపక్ష పార్టీలు ఆందోళన చెందుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో వైఎస్సార్ టీపీ నిర్ణయాత్మక శక్తిగా మారుతుందన్నారు. సంగారెడ్డిలోనూ వైఎస్సార్ టీపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సుదర్శన్, ఎల్లయ్య, మోహన్, రాజు, దేవిదాస్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

రసాయన పరిశ్రమలో అగ్ని ప్రమాదం


పరిశ్రమలో వెలువడుతున్న పొగ

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని గడ్డపోతారం పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో రసాయనాలను కలుపుతున్న సమయంలో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించింది. గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని కేకులే ఫార్మా పరిశ్రమలోని 4వ అంతస్తులో కార్మికులు పనిచేస్తున్నారు. రసాయనాలను కలుపుతున్న సమయంలో ఒక్కసారిగా మంటలు ఎగిసి పడ్డాయి. అక్కడే పనిచేస్తున్న కార్మికులు బయటకు పరుగులు తీశారు. సమీప పరిశ్రమల సహకారంతో ఫోం విరజిమ్మి మంటలను అదుపు చేశారు. దీంతో భారీ ప్రమాదం తప్పింది. రసాయనాలను కలపుతున్న సమయంలో తగిన నైపుణ్యం ఉన్న కార్మికులతో పనులు చేయించాల్సి ఉండగా యాజమాన్యం నిబంధనలను పాటించటం లేదని కార్మికులు ఆరోపించారు. ప్రమాదం జరిగిన సమయంలో జర్నలిస్టులను కూడా ప్రమాద స్థలం వరకు వెళ్లనీయకుండా పరిశ్రమ యాజమాన్యం అడ్డుకుంది. పరిశ్రమ నిర్వహణ లోపాలు వెలుగులోకివస్తాయనే ఉద్దేశంతోనే పరిశ్రమలోకి పంపటం లేదని జర్నలిస్టులు ఆరోపించారు. ప్రమాదంపై దర్యాప్తు జరుపుతున్నామని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులు తెలిపారు. ప్రమాదంలో ప్రాణహాని జరగలేదని యాజమాన్యం ప్రకటించింది.

బైక్‌ను ఢీకొన్న కారు

ఏఆర్ కానిస్టేబుల్ దుర్మరణం



నాగరాజు మృతదేహం

కొల్చారం(నర్సాపూర్): బైక్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్ మృతి చెందాడు. ఈ సంఘటన మండల కేంద్రమైన కొల్చారం శివారు సత్యసాయి రైస్‌మిల్ సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగింది. కొల్చారం ఏఎస్‌ఐ తారాసింగ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హవేళీఘనపూర్ మండలం జక్కన్నపేటకు చెందిన నాగరాజు(38) హైదరాబాద్‌లోని తెలంగాణ స్టేట్ పోలీస్ ఫస్ట్ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. శనివారం సాయంత్రం విధులు ముగించుకొని బైక్‌పై స్వగ్రామానికి వచ్చాడు. కుటుంబ సభ్యులతో గడిపిన ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమైనాడు. ఈక్రమంలో కొల్చారం శివారులో హైదరాబాద్ నుంచి ఎదురుగా వస్తున్న కారు బైకును ఢీకొట్టింది. ఈప్రమాదంలో నాగరాజు తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.